# నిశ్శబ్ద తరంగాలు

**పెళ్లి పందిట్లోంచి మంత్రాలు గట్టిగా వినిపిస్తున్నాయి. మనవరాలి పెళ్లి దగ్గర్నుంచి చూడాలని అన్నపూర్ణమ్మ పెళ్లికూతురికి దగ్గరగా కూర్చుంది.**

ఏ పని చేద్దామన్నా "మీరు పెద్దవారు. చీటికీ మాటికీ లేవకండి. మేమంతా ఉన్నాం కదా. మీరిక్కడ కూర్చోండత్తయ్యా!" అని పెద్దకోడలు అక్కడ కూర్చోపెట్టి వెళ్లింది.

పెళ్లికూతురి ముస్తాబులో మెరిసిపోతున్న గాయత్రిని చూసి ఆమె మనసు పరవశించిపోయింది.

పెద్దలు సమ్మతించిన ప్రేమవివాహం. చాలామందే వచ్చేరు. అంత పెద్ద హాలూ పెళ్లికి వచ్చినవారితో నిండిపోయింది.

అన్నపూర్ణమ్మ కళ్ళజోడు సవరించుకుంటూ చుట్టూ పరికించి చూసింది. ఆమె భర్త శంకరరావుగారు మగపెళ్లి వారితో ఏదో మాట్లాడుతూ నవ్వుతున్నారు.

కళ్ళజోడులోంచి పరికించిచూస్తున్న ఆమె కళ్ళు ఒకచోట హఠాత్తుగా ఆగిపోయేయి. ఆ కళ్ళు ఆశ్చర్యానందాలతో వెడల్పయేయి.

"ఈయన పెళ్లికొడుకు తాతగారు" ఎవరో అంటున్నారు అతన్ని చూపించి.

అతను... అతను. ఆమె మనసు లోపలి పొరల్లో ఏవో కదలికలు... ఏవో పాత జ్ఞాపకాలు. నాటికీ-నేటికీ కూడా మనసు విప్పి మాట్లాడుకోలేని అశక్తత. అయినా మనసులోనే తిష్ఠ వేసుక్కూర్చున్న ఆ వ్యక్తిని మరిచిపోవడం ఈ జన్మకి అసాధ్యం.

ఇంత వయసు వచ్చింది. కొడుకులు-కోడళ్ళు, మనవలు-మనవరాళ్లు అందరూ ఉన్నారు. శరీరం ముడతలు పడి వార్ధక్య లక్షణాలు కూడా వచ్చేసేయి. కాని మనసుకి ముసలితనమన్నది లేదేమో. అందుకే ఆమె మనసు అతన్ని చూడగానే పురివిప్పిన నెమలిలా అయింది.

ఆ సమయంలో పెళ్లి పందిట్లో కూర్చున్న ఒక ముసలి ముత్తైదువ తన మనసులో ఇన్నాళ్ళూ పదిలంగా దాచుకున్న ప్రేమానుభూతులు నెమరువేసుకుంటోందని ఎవ్వరూ ఊహించలేరు.

"అతని మనవడా పెళ్ళికొడుకు?" ఆమె మనసు ఒక విధమైన తృప్తితో నిండిపోయింది. కారణం-తను సాధించలేనిది తన మనవరాలు సాధించింది. అది ఈ తరం పిల్ల. నిజమే. ఆమాత్రం ధైర్యం ఆడపిల్లకుండాలి. లేకపోతే తనలా...

ఏమిటి తను ఇలా ఆలోచిస్తున్నాది. తను ఆడది. ధైర్యం లేదు. పోనీ అతను మగాడు కదా! అతనికేమాత్రం ధైర్యం ఉందట! అతనికి తనంటే బోలెడు ఇష్టం అని తనకి బాగా తెలుసు. తనకి అతనంటే ఎంత ఇష్టమో తనకన్నా తన మనసుకి బాగా తెలుసు. అయినా ఇద్దరిలో ఏ ఒక్కరూ ధైర్యం చేయలేకపోయేరు. కారణం ఏమిటి?

అన్నపూర్ణమ్మ నవ్వుకుంది. అది పాతతరం. తనూ, రామ్మూర్తీ పాత తరానికి ప్రతినిధులు. ఆ తరంలో ఇంత విచ్చలవిడితనం లేకపోవటమే నోరు మెదపలేకపోవటానికి కారణమేమో!

అప్పటి రోజుల్లో పెద్దలంటే భయం, భక్తి, ఎనలేని గౌరవం ఉండేవి. వంశం పరువు-ప్రతిష్ఠలనీ, ఇదనీ-అదనీ పాకులాడేవారు. ప్రేమంటే గుండెల్లో పదిలంగా దాచుకునే వస్తువుగా భావించేవారుగాని పెద్దలనెదిరించి పెళ్ళిళ్ళు చేసేసుకోవడం, ఇంట్లో వాళ్ళకి తెలియకుండా రాత్రికి రాత్రి లేచిపోవడం, కన్న తల్లిదండ్రులని తీరని క్షోభ పెట్టడం ఆ తరం వాళ్ళకి బొత్తిగా తెలియని విషయాలు. అందుకే... గాయత్రిని సాగర్‌కిచ్చి పెళ్ళి చెయ్యడానికి కొడుకు-కోడలు అంతగా ఇష్టపడకపోయినా, తను కల్పించుకొని 'పెద్దల నెదిరించి పెళ్ళి చేసుకుంది' అనే అపఖ్యాతి మనవరాలికి రాకుండా ఉండాలంటే సాగర్‌కిచ్చి చెయ్యడమే మంచిదని సలహా ఇచ్చింది.

మంగళసూత్రధారణ జరిగిపోయింది. అన్నపూర్ణమ్మ మెల్లగా లేచి వధూవరులిద్దరి మీదా అక్షింతలు జల్లివచ్చి తన జాగాలో కూర్చుంది. ఆమె మనసు ఎన్నో సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది.

అప్పుడు తనకి పదహారేళ్ళు. ఒకరోజు అన్నయ్య ఫ్రెండ్సు వాళ్ళ వీధి వాకిట్లో కూర్చున్నారు. వాళ్ళలో రామ్మూర్తికూడా ఉన్నాడు. అన్నయ్య అప్పుడు విజయనగరం మహారాజా వారి కళాశాలలో చదివేవాడు. వాళ్ళు ఏవో కాలేజి విషయాలు మాట్లాడుకుంటున్నారు. రామ్మూర్తిని చూసినా, రామ్మూర్తి గొంతువిన్నా తన మనసు భాషకందని అదేదో తీయని బాధకి గురయ్యేది. రామ్మూర్తి ప్రతిరోజూ వస్తే బాగుణ్ణని అనుకునేది తను. కాని ఏం లాభం? ఎదుటపడి మాట్లాడలేదు.

ఆ కాలంలో పెళ్ళికాని ఆడపిల్ల మగాళ్ళ ముందుకు రాకూడదు. ఒకవేళ అలాంటి పరిస్థితి ఏర్పడినా తలవంచుక్కూర్చోవాలే గాని పెదవి విప్పి మాట్లాడకూడదు.

'మగపిల్లల ఎదుట కూర్చుని మగపిల్లలతో సమానంగా మాట్లాడితే... పరువు పోదూ? రేపు ఆ పిల్లని ఎవరు చేసుకుంటారు?' అనుకునేతత్త్వం పెద్దల్లో ఉండడమే దీనిక్కారణం.

అన్నయ్య లోపలికి వచ్చి అందరికోసం కాఫీలు చెయ్యమన్నాడు. తను కాఫీలు గ్లాసుల్లో పోసి తలుపు వెనకనించి కేకేసి పిల్చింది. అన్నయ్య వచ్చి గ్లాసులు పట్టుకు వెళ్ళాడు. తన మనసు తెగ కొట్టుకుపోయింది. రామ్మూర్తికి తన చేతుల్తో కాఫీ ఇస్తే బాగుణ్ణని. ఒక్కసారి ఆ అబ్బాయి కళ్ళలోకి చూస్తే బాగుణ్ణని. ఉహుం, అలాంటి భావాలు ఆడపిల్లకి ఉండడమే మహాపరాధంగా భావించే వంశం వాళ్ళది. అందుకే నిశ్శబ్దంగా లోపలికి నడిచింది తను.

అన్నయ్యకీ, రామ్మూర్తికీ మధ్య మంచి స్నేహం ఏర్పడింది. తరువాత ప్రతీరోజూ రామ్మూర్తి అన్నయ్యకోసం వచ్చేవాడు. తను ఎప్పుడైనా వీధి గుమ్మంలో నించుంటే "సూర్యం ఉన్నాడా?" అని అడిగేవాడు తన కళ్ళలోకి అదోలా చూస్తూ. అలా చూస్తుంటే తనకేమిటో అయిపోయేది. నోటంట మాటకూడా వచ్చేది కాదు. 'ఉన్నాడు' అని చెప్పటానికి బోలెడు తడబడిపోయేది. లోపలికి వచ్చి కూర్చోమని చెప్పటానిక్కూడా సిగ్గుతెరలు అడ్డుపడేవి. అన్నయ్యతో మాట్లాడుతూ చాలాసేపు కూర్చునేవాడు రామ్మూర్తి.

ఆ తరువాత మాటల సందర్భంలో తెల్సింది. వాళ్ళదీ, తమదీ ఒకటే 'శాఖ' అని. తనకేమిటో వెర్రి ఆనందం కలిగింది. అప్పుడే తనకీ-రామ్మూర్తికీ పెళ్ళి అయిపోతున్నట్టే కలలు కనేది. పిచ్చి! ఆ వయసులో అలాంటి పిచ్చి ప్రతి ఆడపిల్లకీ ఉంటుందేమో. రామ్మూర్తి ప్రతి రోజూ వచ్చేవాడు. వచ్చినప్పుడల్లా అన్నయ్యతో మాట్లాడుతున్నా కళ్ళు మాత్రం ఎప్పుడూ తలుపువైపే ఉండేవి.

తనకోసమేనని తనకి బాగాతెలుసు. తనని చూడగానే రామ్మూర్తి కళ్ళలో మెరిసే మెరుపు తను కనిపెడ్తూనే ఉంది. తనకీ అలాగే ఉండేది. రామ్మూర్తి మనసులో మెదిలితే చాలు తన మనసు వింతగా పులకించేది. తన మనసులోని మాట అతని మనసుదాకా ఎలా చేరుతుంది? ఈ సందేశం అతనికి చేరాలి? ఎలా? మనసులు మాట్లాడుకునే భాష ఒకటి ఉంటే బాగుణ్ణు అని కొట్టుకుపోయేది తను. అప్పట్లో మనసు ఇంత మథన పడుతున్నా పెదవి విప్పలేక, అడుగు ముందుకు వెయ్యలేక నిశ్శబ్దంగా గుటకలు మింగుతూ ఉండిపోయేది.

అదే ఇప్పటి కాలంలో అయితే - 'ప్రేమించుకుంటున్నాం' అని పార్కుల్లోనూ, హోటళ్ళలోనూ, సినిమా హాళ్లలోనూ ఎక్కడ చూసినా వాళ్ళే ఉంటారు అబ్బాయిలూ, అమ్మాయిలూ. అయిదు నిముషాల పరిచయానికే కుల-గోత్రాలు, ఊరూపేరూ, ఉద్యోగం-సద్యోగం ఏమీ అడక్కుండానే హోటల్లో రూమ్ బుక్‌చేసేసుకోవడం, ముందు తొందర పడడం-తరువాత బాధపడ్డం. అప్పటికీ-ఇప్పటికీ ఎంత తేడా. అప్పటి రోజుల్లో చేతివేళ్ళు కూడా తగలకుండా జాగ్రత్తపడేవారు. ఇప్పుడైతే భుజాలు-భుజాలు రాసుకుంటూ నడవడం, తూలుతూ, ఒకళ్ళమీద ఒకళ్ళు పడిపోతున్నట్టుగా నడవడం ఫాషన్. మన సంస్కృతి ఎటువైపు పయనిస్తున్నది?

అన్నపూర్ణమ్మ ఆలోచనల్లోంచి తేరుకుని రామ్మూర్తివైపు చూసింది.

ఆశ్చర్యం! రామ్మూర్తి ఇటే చూస్తున్నాడు. అతని కళ్ళు ఆశ్చర్యంగా, తదేకంగా ఆమెనే చూస్తున్నాయి. అన్నపూర్ణమ్మ చెమర్చిన కళ్ళు తుడుచుకోవడానికి కళ్ళజోడు తీసింది.

రామ్మూర్తి ఆమెని గుర్తుపట్టేడు. సూర్యం చెల్లెలు! అతని మనసు ఉప్పొంగిపోయింది. పెళ్ళయిన తరువాత కూడా అన్నపూర్ణని ఎన్నిసార్లు చూసేడు. కాని ఈ మధ్య పదిహేనేళ్ళయి ఉంటుంది ఆమెని చూడక. బాగా మారిపోయింది. ముసలిరూపు వచ్చేసింది. అయినా ఆ చూపు... తనకి బాగాపరిచయమైన ఆ చూపు. అతని కళ్ళలోంచి రెండు కన్నీటిబొట్లు రాలి తెల్లని ధోవతిమీద పడి ఇంకిపోయేయి. ఊహకందని మధురభావం అతని మనసుని ఒక్కనిముషం ఊపేసింది. నరనరానా ఏదో అనుభూతి వింతగా పాకుతున్నట్టు శరీరం సన్నగా కంపించింది. ఒక తీయని భావన అతని మనసు పొరల్లోంచి పాతాళగంగలా దూకుతోంది. ఆమె అతని ఊహల్లో శాశ్వతంగా ముద్రించుకుపోయిందన్న సత్యం అతనొక్కడికే తెలుసు. కేవలం అతనొక్కడికే. ఎవ్వరికీ చెప్పకుండా పదిలంగా గుండెలో దాచుకున్నాడు ఆమె రూపాన్ని. తను సూర్యంతో స్నేహం చేసి వాళ్ళింటికి రోజూ వెళ్లేది అన్నపూర్ణని చూడ్డంకోసమే నన్నసంగతి అసలు ఎవ్వరికీ తెలీదు. తను కాస్తంత ధైర్యంచేసి ఉంటే? తన మనవడికున్న ధైర్యంలో పదోవంతు కూడా తనకి లేదు అప్పుడు.

పెద్దవాళ్ళు ఏమనుకుంటారో అని భయం. నలుగురూ తమని గురించి చెడుగా మాట్లాడుకుంటే పెద్దవాళ్ళ పరువేమైపోతుందో అని భయం. ప్రతిదానికి భయమే. తామిద్దరిదీ ఒకటే శాఖ అని తెలిసి కనీసం పెద్దవాళ్ళయినా తమ పెళ్ళిమాట ఎత్తుతారేమోనని ఎన్నోరోజులు ఆత్రంగా ఎదురు చూసేడు తను. కాని తరువాత తెలిసింది తామిద్దరిదీ ఒకటే గోత్రమని. అప్పట్లో సగోత్రికుల మధ్య వివాహం జరిపేవారు కాదు.

ఆ ఆశకూడా పోయేక తను పిచ్చిగా జుత్తుపీక్కున్నాడు. అన్నపూర్ణకి పెళ్ళని తెలిసి తను

నిశ్శబ్దంగా ఎంత వేదన పడ్డాడో ఎవరికీ తెలియదు. ఆమెని మరిచిపోలేడు. మనసులోంచి తీసెయ్యలేడు. అలాగని ధైర్యం చెయ్యలేడు. కనీసం తామిద్దరి మధ్యా హాయిగా మాట్లాడుకునే అవకాశం కూడా ఎప్పుడూ కలగలేదు. సాంప్రదాయపు ఉక్కు సంకెళ్ళని తెంచుకునే శక్తి తనకి అప్పుడూలేదు - ఇప్పుడూ లేదు. పెద్దవాళ్ళపై ఉన్న గౌరవంతో తన భావాలను తనమనసులోనే సమాధి చేసేసు కున్నాడు.

అన్నపూర్ణ సుఖంగా, సంతోషంగా, పచ్చగా, నిండుగా ఉంది. అంతేచాలు. తన జీవితానికింకే ఆనందమూ అక్కర్లేదు అనుకున్నాడు రామ్మూర్తి.

జీవితంలో పశ్చిమదిశకు చేరుకున్నారు ఇద్దరూ. సమాజం దృష్టిలో వాళ్ళిద్దరూ ముసలివాళ్ళు. కాని ఆ ముసలితనం వాళ్ళ శరీరాలకే-మనసులకి లేదు. పవిత్రమైన ప్రేమకు పాతతరం ప్రతినిధులు వాళ్ళిద్దరూ. పెద్దలని గౌరవిస్తూ, పరువు-ప్రతిష్ఠలకి భంగం కలక్కుండా జీవితంతో రాజీపడిపోయి బతకడంలోనే తృప్తి ఉందని గ్రహించిన వాళ్ళు. భావావేశాలను అణచిపెట్టి జీవిత సాగరంలో కొట్టుకుపోతున్న నిశ్శబ్ద తరంగాలు వాళ్ళిద్దరూ.

★ ★ ★

*(ఆంధ్రప్రభ, వీక్లీ; 16-9-87)*